# జీవనరేఖ

ఆ రోజు ఆఫీసుకి వెళ్తోంటే అనిపించింది. కొన్ని రోజులు ఈ మెకానికల్ జీవితానికి దూరంగా ఎటూ పోలేనా? అని. రోజూ నిద్రలేవడం... వంట చేయటం, తినడం, ఈ సిటీబస్సుల్లో వేళ్ళాడుతూ ఆఫీసుకి వెళ్ళడం. సీటులో కూర్చుని ఆవలించడం. నాకే అసహ్యంగా అన్పిస్తోంది.

ఆడవాళ్లకి జాబ్ సెక్యూరిటీ ఉంటుందని గానీ, గవర్నమెంటు ఉద్యోగాల్లో ఉన్న మొనాటనీ ఇంకెక్కడా లేదు. రూల్ ప్రకారం, సీనియారిటీ ప్రకారం ఏవో ప్రమోషన్లు ఇస్తుంటారు. కానీ ఇంపార్టెన్స్, కొంత బాధ్యత ఉన్న సీటు మాత్రం ఇవ్వరు.

"లేడీస్ చేయలేరు మేడమ్, లైట్ సీటు తీసుకోండి" అంటారు పెద్ద కన్సర్న్ ఉన్నట్టు. కానీ అంత ప్రేమ ఎందుకో అందరికీ తెలుసు. సీటుని బట్టి ఆదాయం ఉంటుంది.

సంపాదనకి అలవాటుపడ్డవాళ్ళు ఏ సీటు ఇచ్చినా సంపాదిస్తారు. కాని ఆడవాళ్లకి సంపాదనకన్నా ఏదో చేయాలని, ఏదో సాధించాలని తపన ఎక్కువ. నాలాంటివాళ్ళకి బ్రిటీష్ కాలంనాటి రూల్స్‌లో మార్పులు తీసుకొచ్చి చాలా సంస్కరణలు తీసుకురావాలని అనిపిస్తుంటుంది. కానీ ఏం చేయగలం?

నేను ఈ ఆఫీసులో చేరిన కొత్తల్లోనే అర్థమైపోయింది నాకు. నాకేదో తెలివితేటలు చాలా ఉన్నాయని, అవన్నీ ప్రదర్శించాలనుకోవడం, తెలివితక్కువ అని. ఎం.ఏ. సైకాలజీ చదివి కూడా గ్రూప్ ఫోర్ ఎగ్జామ్స్ రాసి క్లర్క్‌గా జాయిన్ అయిన రోజు నా ఆంగ్ల పరిజ్ఞానం ప్రదర్శించబోయి భంగపడ్డ రోజు బాగా గుర్తు.

రొటీన్ డ్రాఫ్ట్‌లో అందమైన ఇంగ్లీషు పదాలు చేర్చి కొత్తగా రాసి నాకేదో మెడల్ ఇస్తాడనుకుని సెక్షన్ ఆఫీసర్ దగ్గరకు తీసుకెళ్ళి కొంచెం గర్వంగా, మరికొంచెం కాన్ఫిడెంట్‌గా నిలబడ్డాడు.

నల్లటి మొహం మరింత నల్లగా చేసి "ఏంటిది? ఇట్లా కాదు ఈ డ్రాఫ్ట్.

నీకు కొత్త కదా– సీనియర్ని అడిగి రాయి. ఈ సబ్జెక్ట్‌కి సంబంధించిన ఫైల్ ఉంటుంది. తీసుకుని చదివితే తెలుస్తుంది. వెళ్ళి కరెక్ట్ చేయించుకురా!" అంటూ నా మొహానికేసి కొట్టినంత పని చేశాడు.

నీరసంగా సీనియర్ దగ్గరకు వెడితే, గర్వంగా ఫోజు పెట్టి "మీ యంగ్ జనరేషన్ వాళ్ళకి నాలెడ్జ్ తక్కువ. కాన్ఫిడెన్స్ ఎక్కువ" అంటూ పాత డ్రాఫ్ట్ ఇచ్చాడు. అప్పుడే అర్థమైంది గవర్నమెంట్ ఆఫీస్ వర్క్ అంటే "టర్న్ ది పేజ్... లెర్న్ ది వర్క్" అందులో ఎన్ని బూతులున్నా అదే కరెక్ట్. ఎన్ని లొసుగులున్నా శాసనం శాసనమే. అందుకే నెలకి జీతం కరెక్ట్‌గా ఉంటుందో లేదో అని తప్ప ఇంకా ఏ విషయంలో కూడా ఏకాగ్రత కూడదని నిర్ణయించుకున్నాను. అందుకే కచ్చితంగా ఏడాదికి ప్రభుత్వం వారిచ్చే పదిహేను రోజుల సాధారణ సెలవులు, ఐదు ఐచ్ఛిక సెలవులు కాక కొన్ని ఫ్రెంచి లీవులు కూడా ఉపయోగించుకుంటూ కాలం గడపగా, గడపగా నా సర్వీసులో ఇరవై ఏళ్ళు అతి కష్టంగా గడిచిపోయాయి.

అదృష్టం బాగుండి కొంచెం లేటుగా ఈ ఉద్యోగం వచ్చిందేమో? నాకింకా తొమ్మిదేళ్ళ సర్వీసు మాత్రమే ఉంది. తొమ్మిదేళ్ళని ఈజీగా అంటున్నా... లోపల బెంగ మాత్రం భయంకరంగా ఉంది. ఈ మనుషుల మధ్య ఈ మనస్తత్వాల మధ్య ఎలా గడుస్తాయో తొమ్మిదేళ్ళు అని.

కొంతమందిని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. దుమ్ము కొట్టుకుపోయిన పాత ఫైల్ లాగా నలభై ఏళ్ళుగా సర్వీసు చేసి రిటైర్ అయినా ఇంకా ఔట్ సోర్సింగ్‌కి అవకాశం ఉందేమో అని ఆఫీసర్ల చుట్టూ తిరుగుతుంటారు. వాళ్ళకిచ్చే జీతంలో సగం కమిషన్ ఇవ్వడానికి ఒప్పుకున్న వాళ్లకి ఏదో ఒక పోస్టులు ఇవ్వడం కూడా జరుగుతూనే ఉంటుంది. వాళ్ళని చూస్తుంటే నాకు పరమ అసహ్యం వేస్తుంటుంది.

కుర్రవాళ్ళు ఉద్యోగాలు లేక తిరుగుతోంటే కృష్ణా, రామా అనుకోకుండా ముసలి వాళ్ళంతా పైరవీలు చేసుకుని రిటైర్ అయినా సీట్లు ఖాళీ చేయకుండా పట్టుకు వేళ్ళాడుతోంటే వీళ్ళు చచ్చాక కూడా దయ్యాలై ఈ పరిసరాల్లోనే తిరుగుతుంటారేమో అని.

బస్సు కుదుపుకి నేను దిగాల్సిన స్టేజ్ వచ్చిందని అర్థమైంది.

బస్సు దిగి గోరువెచ్చని ఎండలో ఆఫీసు వైపు నడిచాను. డిసెంబరు నెల కదా, బాగా చలిగా ఉంది. అదేంటో చలి కదా అని స్వెట్టర్ వేసుకుంటే కూడా చిత్రంగా చూస్తారు మా ఆఫీసులో. అయినా నేను మొండిదాన్ని కదా స్వెట్టర్ వేసుకునే వచ్చాను. గేటులో అడుగుపెట్టగానే కనిపించిన కొందరు పలకరింపుగా

నవ్వితే, మరికొందరు నమస్తేలు పెడుతోంటే నా క్యాబిన్‌లోకి వెళ్ళి కూర్చోబోతూ ఎస్టాబ్లిష్‌మెంట్లో స్టాఫ్ లీవు అకౌంట్ చూసే క్లర్క్ వచ్చాడేమో అని గ్లాస్‌డోర్‌లోంచి చూశాను. నా పిచ్చిగానీ, పన్నెండు దాటకుండా వచ్చేవాళ్ళెవరున్నారు? స్తబ్దుగా కూర్చున్నా.

కాస్సేపటికి కొంచెం హడావుడిగా "నమస్తే మేడమ్" అంటూ అటెండెన్స్ రిజిష్టరు, మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది అటెండరు రుకియా.

రూలు ప్రకారం పదింటికి రావాల్సిన రుకియా అలవాటుగా నాతో సమానంగా పదకొండు అవుతుండగా రావడం, రోజులాగే ఏదో సమస్య చెప్పుకోవడం మొదలైంది.

"కల్రాత్మే మేరీ బేటీకు సర్ది, ఖాంసీ, పూరీ రాత్ నీంద్ నైథా క్యాకరూ ముసీబత్" అంటూ కొంచెం విషాదంగా ఫీలింగ్స్ పెట్టి "చాయ్ లావూ క్యా" అనడిగింది. చెప్పలేదు కదూ మా గవర్నమెంటు ఆఫీసుల్లో ఎన్నింటికొచ్చినా రాగానే చాయ్ తెప్పించుకుని, వీలైతే పక్కవాళ్ళ పర్స్ ద్వారా తెప్పించుకుని తాగి కానీ పనికి ఉపక్రమించకపోవడం తరతరాల సంప్రదాయం. నాకా సంప్రదాయం లేకపోయినా తెచ్చేవాళ్ళ కోసం ఒక్కోసారి తప్పదు. కానీ సాధారణంగా ఒద్దు అనే అంటాను. అలాగే ఒద్దు అనబోయి రుకియా కోసం బ్యాగు తెరిచి ఐదు రూపాయల నోటు ఇచ్చాను. "తుమ్ పీవో" అంటూ ఆ నోటు కళ్ళకద్దుకుని కాంటీన్‌కి వెళ్ళిపోయింది.

నాకు చేయాల్సిన పనేమీ కనిపించలేదు. నా అసిస్టెంట్స్ వచ్చి ఏవన్నా ఫైల్స్ పుటప్ చేస్తే తప్ప నేనుగా చేయడానికి ఏమీ లేదు. మామూలుగా అయితే ఆఫీసర్లు బాతాఖానీతో సమయం గడిపి ఉద్దేశ పూర్వకంగానే ఫైల్స్ పెండింగ్ పెడతారు. వాళ్ళ చుట్టూ ఓ పదిసార్లు తిప్పించుకుని అప్రూవ్ చేయడమో, క్వొరీలతో రిటర్న్ చేయడమో ఆ తిరిగేవారి లౌక్యంమీద ఆధారపడి ఉంటుంది. నాకా అలవాటు, అవసరం కూడా లేకపోవడంతో నా టేబిల్ మీద పెండింగ్ ఫైల్స్ అంటూ ఉండవు.

అప్పుడప్పుడూ నేను తెచ్చిపెట్టుకున్న నవల్స్‌లో ఒకటి తీసుకుని చదువుకోడం మొదలుపెట్టాను. ఏమాత్రం సమయం చిక్కినా చదవడం ఒక అలవాటుగా చేసుకున్నాను. అది సాహిత్యమే కాదు, ఏది కనిపించినా ఆఖరికి పచ్చిమిర్జీ బజ్జీలు పొట్లం కట్టిన కాగితం కూడా చదవకుండా పారేయకూడదన్న పాఠం నాన్నగారి దగ్గర నేర్చుకున్న తొలి పాఠం. ఈ అలవాటుకి కూడా ఆఫీసులో నేను విమర్శలు ఎదుర్కొన్న సంగతి మర్చిపోను. రూల్స్‌కి వ్యతిరేకం అయినా అలవాటు

చెడ్డది కాదు కాబట్టి కేర్ చేసే అవసరం రాలేదు.

అబ్దుల్‌కలాంగారి 'ఒక విజేత ఆత్మకథ' చదువుతూ కూర్చున్న నాకు చాలాసేపటికి కానీ ఆఫీసులో ఎవరూ లేరన్న విషయం అర్థంకాలేదు. చూస్తే టైం ఒంటిగంట. సెక్షన్ మొత్తం ఖాళీ... చాయ్ తాగడానికి వెళ్ళిన రుకియా కూడా రాలేదు. ఏమైందివాళ ఏదన్నా బంద్ ఉందా? ఈమధ్య ఏ క్షణాన బందో, ఏ క్షణాన ధర్నా జరుగుతుందో తెలియడంలేదు. నేను సీటులోంచి లేచి బైటికి రాబోతోంటే వచ్చింది రుకియా. "ఎక్కడికెళ్ళావు? ఇంకా ఎవరూ రాలేదేంటి? ఇవాళేమన్నా బంద్ ఉందా!" చిరాగ్గా అడిగాను.

"అరె బందేమ్లేద్ మేడమ్. మన టెలిఫోన్ ఆపరేటర్ మేడమ్ కా పతీకా ఇంతెఖామ్ హోగయ్ కతే సబ్జనే వహా గయే కతే గిప్పుడే వస్తుర్రు" అంది.

టెలిఫోన్ ఆపరేటర్ రేఖ... అరె రేఖ భర్త పోయాడా... పాపం... వచ్చే ఏడాది పదవీ విరమణ చేయబోతోన్న రేఖకి అకస్మాత్తుగా ఎంత కష్టం వచ్చింది.

నేను బాధపడుతుండగానే కొంతమంది స్టాఫ్ వచ్చారు. కొందరు అటు నుంచి అటే ఇళ్ళకు వెళ్ళిపోయారు. ప్రజాస్వామ్య దేశం కదా! పెళ్ళిళ్ళకు, చావులకు హాజరవడానికి మా ఉద్యోగులకి ఎవరి అనుమతి అవసరంలేదు. ఇది మా ప్రాథమిక హక్కు. వీలైతే వస్తాం ఆఫీసుకి. లేకపోతే ఇంటికి వెళ్ళి బడలిక తీర్చు కుంటాం. అందుకే వెళ్ళిపోయిన వాళ్ళ గురించి వదిలేసి రేఖ భర్త మరణానికి కారణం వాకబు చేయసాగాను.

ఆమె భర్త చాలా ఆరోగ్యవంతుడు. కానీ హఠాత్తుగా రాత్రి హార్ట్ ఎటాక్ వచ్చింది. హాస్పిటల్‌కి తీసుకునివెళ్ళేలోపే పోయాడు. హఠాన్మరణం సంభవించడం పుణ్యాత్ములకే దక్కుతుంది. "హీ ఈజ్ వెరీ లక్కీ", కానీ "రేఖ వెరీ అన్ లక్కీ" ఇద్దరు పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇద్దరూ మగపిల్లలు. రేఖ ముప్ఫై ఏళ్ళనుంచీ మా ఆఫీసులో టెలిఫోన్ ఆపరేటర్. ఆమె భర్త పంచాయతీ డిపార్టుమెంట్‌లో ఈమధ్యే సీనియర్ క్లర్క్‌గా పదవీ విరమణ చేశారు. మగపిల్లలిద్దరూ దుబాయ్‌లో ఉద్యోగాలు చూసుకుని వెళ్ళిపోయారు. రేఖ ఒంటరిదైంది.

ఈమధ్య సాఫ్ట్‌వేర్ వాళ్ళంతా అమెరికాకి, కాని వాళ్ళు కొందరు ఆస్ట్రేలి యాకి, కొందరు గల్ఫ్ కంట్రీస్‌కి వెళ్ళడం మామూలు విషయం అయింది. ఏం చేస్తారు పాపం? స్వదేశంలో యువత అవసరం కనిపించడం లేదు. రాజకీయాల్లో ఎనభై ఏళ్ళ వాళ్ళు ఉండడం లేదా అంటూ పదవీ విరమణ వయసు పెంచమని ఉద్యోగుల పోరాటాలు, ఆరాటాల మధ్య కొత్త రిక్రూట్‌మెంట్స్ లేవు. సాఫ్ట్‌వేర్‌కి

తప్ప సాధారణ చదువులకి విలువ ఉండడంలేదు. అంతా ప్రైవేటు మయం. అవుట్ సోర్సింగ్ మయం. లేదంటే పయనం. కాదంటే మీడియా అభయం. అప్పటిలాగా కాంపిటేటివ్ ఎగ్జామ్స్ అంతగా లేవు. స్టెనోలు, టైపిస్టులు ఏమీ లేవు. అందుకే పేరెంట్స్ అంతా పిల్లలు పుట్టగానే మెంటల్‌గా ప్రిపేర్ అయి పోతున్నారు. వీళ్ళు అబ్రాడ్ వెళ్ళడం ఖాయం అని. అందుకే భార్యాభర్తల్లో ఎవరు పోయినా రెండోవాళ్ళు ఒంటరిగా ఉండడంలో ఆశ్చర్యంగానీ, బాధకానీ కలగడం లేదు.

రేఖ పదిహేను రోజుల తరువాత ఆఫీస్‌కి వచ్చింది. ఈలోగా నేను కూడా ఒకసారి వాళ్ళింటికి వెళ్ళి ఆమెని పలకరించి వచ్చాను. బాగా ఏడ్చింది. "ఇంక నాకేం మిగిలింది మేడమ్. నేనెవరి కోసం బతకాలి" అంది. ఇలాంటి సమయాల్లో ప్రతివాళ్ళు వేసే ప్రశ్న ఇదే. కాకపోతే నేను ఒకటే అంటాను. ముందు "ఎవరి కోసం ఇంతకాలం బతికాను" అని ప్రతివాళ్ళు తమని తాము ప్రశ్నించుకోవాలి. తరవాత ఇకముందు ఎవరి కోసం బతకాలి అనే ప్రశ్న వేసుకోవాలి" అని అదే చెప్పి ఓదార్చి వచ్చాను.

ఎప్పుడూ బాగా అలంకరించుకుని, జడలో ఏనాడూ పూవులేకుండా ఆఫీసుకి రాని రేఖ విషాదం మూర్తీభవించినట్టు రావడం చూడలేకపోయాను. రకరకాల స్టిక్కర్స్‌తో కనిపించే నుదురు నల్లటి చుక్కతో ఉంది. ఐలైనర్తో అంతో, ఇంతో అందంగా కనిపించే కళ్ళు కళావిహీనంగా ఉన్నాయి. పూలులేని జడ బోసిగా ఉంది. ఈమధ్య వర్క్ చేసిన చీరల్తో ఎక్కువగా కనిపించేదేమో ఆమె కట్టుకున్న చీర కూడా సింపుల్‌గా ఉంది. మొహాన నవ్వులేదు.

నా సీటు దగ్గరికి పిలిపించుకుని చెప్పాను– "ఈరోజుల్లో ఎవరు పాటిస్తున్నారివన్నీ... ఎందుకిలా వచ్చావు?" అని.

ఏమీ మాట్లాడలేదు.

"పోయినవాళ్ళతో పోలేము, అలా అని వాళ్ళు లేరని తిండి, నిద్రా మానము కదా" అన్నాను.

"ఏమో మేడమ్ లైఫ్ అంతా ఏమి చేయాలో తెలియడంలేదు. ఇంక నాకు లైఫ్ ఏం ఉంది? మా ఆయన్తోనే పోయింది.

"అలా అనకు. అలా అనుకుంటే ఎవరూ బతకలేరు. వాళ్ళంతా బతకడం లేదా" అన్నాను నా కాబిన్ బైట కబుర్లు చెప్పుకుంటున్న క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్‌ని చూపిస్తూ. వాళ్ళంతా భర్తలు చనిపోగా వాళ్ళ స్థానంలో ఉద్యోగాలకి వచ్చినవాళ్ళు.

అందరికీ ఎన్నో సమస్యలు... భర్తలు తాగుబోతులై ఇల్లు... ఒళ్ళు... గుల్ల చేసుకుని, అప్పులని, గంపెడు పిల్లలని వదిలి అకాల మరణం పొందినవాళ్ళు. నానా అగచాట్లు పడుతూ ఆ అప్పులు తీర్చుకుంటూ చావలేక బతుకుతున్నా మొహాల్లో చిరునవ్వులు చెదరవు. వాళ్ళెప్పుడూ 'మేమెవరి కోసం బతకాలి' అని ప్రశ్నించడం నాకు తెలియదు. క్యా కర్నా బచ్చోంకే లియా జీనా పడ్తా... పిల్లల కోసం బతకాలి అనుకుంటూ మానసికంగా పరిణితి పొందినవాళ్ళు.

"పిల్లలు కూడా ఎవరి దారిన వాళ్ళు పోయారు. ఒంటరిగా బతకడం ఎట్లా? భయం వేస్తుంది."

"భయమా? నాకు భయం గురించి తెలియదు. అందులోనూ ఒంటరిగా బతకడం గురించి అసలే భయం లేదు. గత పదేళ్ళుగా అంటే అమ్మా, నాన్న పోయినప్పటి నుంచీ ఒంటరిగానే బతుకుతున్నా. నాకు వేరే వాళ్ళతో కలిసి బతకడం అంటేనే భయం. వాళ్ళ బలహీనతలను భరించాలంటే భయం. వాళ్ళ హిపోక్రసీని చూస్తూ బతకడం మరీ భయం. వారి ప్రేమాభిమానాల్లో నటన అంటే భయం. మమతానురాగాలకన్నా మనీరాగాలంటే భయం. నాకు నా పుస్తకాలే తోడుగా, నా సిద్ధాంతాలే నీడగా నిర్మలంగా బతికే ఈ బతుకంటే ఏ భయం లేదు. అవన్నీ అనలేదు నేను. అన్నా కూడా ఆమెకి అర్థంకావని తెలుసు.

ఆమె కూడా ఏమీ మాట్లాడలేదు.

నా మాటలు ఏమన్నా ప్రభావం చూపించాయేమో అని రెండురోజులు పరిశీలించా. పెద్దగా ఫలితం కనిపించలేదు. రోజులు గడుస్తూనే ఉన్నాయి. మా ఆఫీసులో ఒక పక్క రూల్స్, మరోపక్క ప్రజాస్వామ్యం యథాప్రకారం సాగిపోతూనే ఉన్నాయి. ఐదారు నెలలు గడిచిపోయి ఉంటాయి. నా రొటీన్‌లో మార్పులేదు. రాదు కూడా. ఆఫీసులో కూడా మార్పు ఏం ఉంటుంది? బ్రిటిష్ కాలంనాటి అవే జీవోలు... అవే రూల్స్ అయితే చిన్న కెరటంలాంటి మార్పు. అది రేఖలో...

భర్తపోయాక కలిగిన మార్పులో కొద్దిపాటి చైతన్యం. ఆమె ఇప్పుడు మామూలుగా తయారవుతోంది. అప్పటిదాకా ఆమె మీద కుండల కొద్దీ సానుభూతి కురిపించిన మా స్టాఫ్‌లో గుసగుసలు మొదలయ్యాయి.

రకరకాల స్టిక్కర్స్, ఐలైనర్, మంచి చీరలు ముందు గమనించిన మార్పులు. జడలో మల్లెపూల దండ, తరువాత గమనించిన మార్పు. పోనీలే ఆమెలో ఆత్మవిశ్వాసం కలిగినట్టుంది. వయసుకి తగిన మానసిక పరిణతి రావాలి కదా! ఆమె పదవీ విరమణ కాలం దగ్గరికి వచ్చింది కూడా అనుకున్నా.

కాని మిగతావాళ్ళు మాత్రం ఎబ్బెట్టుగానే చూశారు.

నాక్కూడా... ఎక్కడో... ఏ మూలో... ఇలాంటి భౌతికమైన సాంత్వన అవసరమా? ఈ వయసులో అనిపించింది. కానీ అలా అనుకోడం సంస్కారం కాదని నన్ను నేను మందలించుకున్నా. ఎవరిష్టం వారిది. ఆమెకి జీవితంలో అలంకరణకి అంత ప్రాధాన్యం ఇచ్చిందేమో! దానిదేం ఉంది. భర్త పోయినవాళ్లు అలంకరించుకోకూడదా!

అయితే ఆరోజు తెలుసుకున్న విషయంతో ఆమె మీద జాలిపడాలో? ఆ మానసిక బలహీనత మీద కోపం తెచ్చుకోవాలో తెలియలేదు.

నేను ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా వెళ్ళే బాబా గుడికి ఆ ఆదివారం రేఖ వచ్చింది. ఒక్కతే రాలేదు. పక్కన ఎవరో పెద్దాయన ఉన్నాడు. మొహంలో ఏదో తృప్తి. మరేదో ఆనందం కనిపిస్తున్నాయి. కొంచెం నా మనసులో ఎక్కడో చిన్నగా ఇబ్బందిగా అనిపించింది. మళ్ళీ నాకు నేనే సర్ది చెప్పుకుని ఏమోలే వాళ్ళన్నయ్యో... బంధువో కావచ్చు అనుకున్నాను.

కానీ అదే వ్యక్తి ఓసారి సినిమా హాల్లో కనిపించడం, నవ్వుతూ, తుళ్ళుతూ ఉండడం నేను తట్టుకోలేకపోయాను. ఆ వ్యక్తి ఎవరో కాదు, అక్కగారు చనిపోతే రేఖకి భర్తగా మారిన ఆమె బావగారే అని తెలిశాక ఆ వాస్తవం జీర్ణించుకోడం చాలా కష్టమైపోయింది.

అవసరమా ఈ వయసులో మరో పెళ్ళి? దేనికోసం చేసుకుంది? తోడు కోసమా? అరవై ఏళ్ళకి చేరువవుతున్న ఈ వయసులో మగతోడే కావాలా? సెక్స్ కోసమా? ముప్ఫై ఏళ్ళు అనుభవించిన ఆ జీవితం మీద ఇంకా మోజుందా? వగైరా ప్రశ్నలతో నా మెదడు వేడెక్కింది.

ప్రజాస్వామ్యానికీ, బ్రిటిష్ కాలంనాటి రూల్స్‌కి పొంతన లేని పద్ధతులతో రాజీపడి ఉద్యోగిగా ఇరవై ఏళ్ళ నుంచి ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న నేను... రేఖ ఎంచుకున్న చివరి మజిలీని మనస్ఫూర్తిగా అభినందించాలో? లేదో అనే సందిగ్ధంలో ఉండగానే రేఖ ఉద్యోగం మానేసి వాలంటరీ రిటైర్మెంటు తీసుకుంది.

***

*(12 నవంబర్ 2011, ఆంధ్రభూమి)*